క్లుప్తంగా

కనకమహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వర రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు



దంత పరీక్షలు చేయించుకుంటున్న విద్యార్థులు

డాబాగార్డెన్స్: డాబాగార్డెన్స్‌లోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో శ్రీకృష్ణ డెంటల్ కేర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించి పరీక్షలు జరిపారు. సుమారు 180 మంది విద్యార్థులు పాల్గొనగా, వారందరికీ వైద్యులు తగిన సలహాలు, సూచనలు అందించారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ కళాశాలల ఉత్తరాంధ్ర సంచాలకుడు పి.రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ కె.కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌వీ బాబ్జి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి. శ్రీనివాసరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. భాస్కరరావు, ఏపీవో ఎ. వినోద్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కథల పోటీ



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

డాబాగార్డెన్స్: డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్ సాఫ్ట్ స్కిల్ ఆధ్వర్యంలో ఉల్లాసంగా కథల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమలు జరిగాయి. చిన్నారులు ఆసక్తికరంగా పలు కథలు చెప్పి ఆకట్టుకున్నారు. అనంతరం నృత్య ప్రదర్శనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమానికి కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పీవీ రమణమూర్తి న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. నారాయణ విద్యా సంస్థల ఏజీఎం రాజ్‌కుమార్ చిన్నారులు, తల్లిదండ్రులనుద్దేశించి మాట్లాడారు. ఇటువంటి కథల పోటీలు పిల్లల్లో దాగిన సృజనాత్మకతను వెలికి తీయడానికి ఎంతో దోహద పడతాయన్నారు. కార్యక్రమంలో సుస్మిత, స్రవంతి, జ్యోతి, మౌనిక, లావణ్య, ప్రాంతీయ ఇన్‌చార్జిలు రఘుబాబు, మాధవీలత, హైస్కూల్ కో ఆర్డినేటర్లు రామ్‌నరేష్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

బయో డైవర్సిటీ పార్క్‌లో విద్యార్థుల సందడి



బయోడైవర్సిటీ పార్క్‌లో డిగ్రీ విద్యార్థులు

బీచ్‌రోడ్డు: బొబ్బిలికి చెందిన ఓ డిగ్రీ కాలేజీ విద్యార్థులు శుక్రవారం పెదవాల్తేరులోని బయో డైవర్సిటీ పార్క్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారికి పార్క్ పర్యవేక్షకుడు రామమూర్తి మొక్కల శాస్త్రీయ నామాలు, ఉపయోగాలు, పెరిగే వాతారణం తదితర అంశాల గురించి వివరించారు. బయోడైవర్సిటీ పార్క్‌లో విద్యార్థులంతా సందడి చేశారు.

ఉచిత బస్సు.. తుస్సు!



దుమ్మెత్తి పోస్తున్న మహిళలు

కూటమి నేతల హామీలు నీటి మూటలే అంటూ మండిపాటు

ఎనిమిది నెలల్లో ప్రజలకు చేసింది సున్నా

జగదాంబ: గత ఏడాది నవంబర్‌లో మహిళలకు ఉచిత బస్సు అంటూ ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం ఆ తర్వాత మిన్నకుండిపోయింది. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తూ వస్తోంది. దీంతో మహిళలు కూటమి ప్రభుత్వంపై మండి పడుతున్నారు. సూపర్ సిక్స్ అంటూ గొప్పలు చెప్పి ఇప్పుడు ఏదీ అమలు చేయడం లేదని.. బాబును నమ్ముకుని సంక్షేమ పథకాలను కాలదన్నుకున్నామని నిట్టూరుస్తున్నారు.

ఏదీ పోరాటం..

ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వాన్ని గెలిపించుకుందాం.. **మన** హక్కుల కోసం పోరాడదాం అన్న పవన్ కల్యాణ్ ఎందుకు మౌనం వహిస్తున్నారని మహిళలు నిలదీస్తున్నారు. అన్యాయాన్ని ప్రశ్నిస్తానని చెప్పిన ఆయన ఇప్పుడెందుకు మట్లాడటం లేదని సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఇదేనా ఆయన పోరాట పంథా అంటున్నారు.

ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పాలి..

మహిళలకు ఉచిత బస్సు అంటూ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత దాని గురించి మాట్లాడటంలేదు. కనీసం మహిళలకు ఎప్పటి నుంచి ఆ సౌలభ్యం కల్పిస్తారో అదైనా చెప్పాలి. తొలుత గత ఏడాది ఆగస్టు 15 నుంచి అన్నారు.. తర్వాత దీపావళి అంటూ సోషల్ మీడియాలో వినిపించింది. ఎట్టకేలకు సీఎం చంద్రబాబు ఇప్పటి పరిస్థితి చూస్తుంటే భయమేస్తుందని వ్యాఖ్యానించడంతో తాము మోసపోయినట్లు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత బస్సు ఉట్టిమాటే..



ఉచిత బస్సు ఊసే లేదు. అన్నీ అమలు కాని హామీలే. పాదయాత్రలో లోకేష్ ఎన్నో హామీలు ఇచ్చారు. ఇప్పుడు వచ్చి వెళ్తున్నారు కానీ తాము ఇచ్చిన హామీల గురించి మాట్లాడటం లేదు. ఉచిత బస్సు ఉట్టిదే అని అర్థమవుతోంది.

– పి.రమణమ్మ, ప్రసాద్‌గార్డెన్స్, జీవీఎంసీ 35వ వార్డు

హామీలన్నీ నీటి మూటలే..



చంద్రబాబు హామీలన్నీ నీటి మూటలే అని తేలిపోయింది. ఎనిమిది నెలలు గడుస్తున్నా ఒక్క పథకం అమలు కాలేదు. ఉచిత బస్సు అన్నారు అదీ లేదు. అదిగో ఇదిగో అంటూ కాలం వెళ్లదీస్తున్నారు గానీ హామీల అమలుకు ప్రయత్నించడంలేదు.

– డి.రమణమ్మ, పండావీధి, జీవీఎంసీ 35వ వార్డు

నమ్మకం పోతోంది..



ప్రజలు అన్ని పథకాలు అందుకోవాలంటే జగనన్న రావాల్సిందే. ఆయన పాలనలో నోరు తెరిచి అడక్కుండానే ఇంటికి తెచ్చి ఇచ్చేవారు. కూటమి నాయకులు వారు చెప్పింది కూడా చేయడంలేదు. హామీల అమలుపై నమ్మకం పోతోంది.

– జానకి, దుర్గమాంబ సమాజం, జీవీఎంసీ 35వ వార్డు



పూర్ణామార్కెట్ జంక్షన్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న మహిళలు



వెలంపేట వద్ద బస్సుల కోసం మహిళలు, విద్యార్థుల నిరీక్షణ

దుర్గాలమ్మను దర్శించుకున్న వాసుపల్లి



దుర్గాలమ్మను దర్శించుకుంటున్న వాసుపల్లి

జగదాంబ: శాకంబరి అలంకరణలో ఉన్న పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే వాసుపలి గణేష్‌కుమార్ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు నాయకుడు అలపన కనకరెడ్డి, పార్టీ విశాఖ జిల్లా సెక్రటరీ ఆవివిష్ణు, నియోజకవర్గం క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు సువార్తరాజు, లండా రమణ, గండిబోయిన చిన్న, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా దుర్గాలమ్మ



శాకంబరి అలంకరణలో దుర్గాలమ్మ

డాబాగార్డెన్స్: పూర్ణామార్కెట్‌లో వెలసిన దుర్గాలమ్మ దేవస్థానం వార్షిక జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలు ఈ నెల 27 వరకు కొనసాగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా దుర్గాలమ్మ శుక్రవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. భవానీ మాలధారులు అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. ప్రత్యేక కుంకుమ పూజలు, ప్రత్యేక అర్చనలతో పాటు పంచామృతాభిషేకం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం పుష్పాలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

సంప్రదాయాలకు ఆయువుపట్టు మాతృభాష



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల



సెయింట్ జోసెఫ్ కళాశాల విద్యార్థినులతో అధ్యాపకులు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. కళాశాల తెలుగు, ఇంగ్లీషు, హిందీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల పాల్గొని మాట్లాడారు. భవిష్యత్ తరాలకు మాతృభాషను అందించాల్సిన బాధ్యతను వివరించారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎస్‌వీ పద్మకుమారి, ఆంగ్ల విభాగ అధ్యాపకులు జె. సునీత, బి. శాంతి, హిందీ విభాగ అధ్యాపకుడు డాక్టర్ నాయక్ మాట్లాడుతూ మాతృభాష సంస్కృతి, సాంప్రదాయాలకు ఆయువుపట్టు అని, భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే మన జీవన వైవిధ్యాన్ని కాపాడుకోగలమని వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ, పాటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ బి. అనూష, బోటనీ విభాగ అధ్యాపకులు డాక్టర్ నివేదిత, డాక్టర్ లావణ్య, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషతోనే మానవ వికాసం..

కంచరపాలెం: మాతృ భాషతోనే మానవ వికాసమని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని కళాశాలలో ఘనంగా నిర్వహించారు. హిందీ విభాగాధిపతి డాక్టర్ పి.కె.జయలక్ష్మి నేతృత్వంలో విద్యార్థులకు మాతృభాషపై వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రసంశా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ నిర్మల, డాక్టర్ ఎస్. దీప్తి, డాక్టర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో విధులు నిర్వర్తిస్తున్న ప్రతి ఉద్యోగి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, నిర్ణీత సమయంలో ఫిర్యాదులు పరిష్కరించాలని అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్‌ఎస్ వర్మ పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ ఆదేశాల మేరకు అధికారులు, ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతిరోజూ ఈ కార్యక్రమానికి సంబంధించి ఫిర్యాదులపై అధికారులు, ఉద్యోగులు నిర్ణీత సమయం కేటాయించి, వాటిని పరిష్కరించాలని, చాలా మంది ఉద్యోగులు పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తద్వారా ప్రజా సమస్యలు నిర్ణీత సమయంలో పరిష్కారం కావడం లేదన్నారు. అశ్రద్ధ వహించిన వారిపై ఇప్పటికే చార్జ్ మెమోలు జారీ చేశామని, ఇకపై క్రమశిక్షణ చర్యలు చేపడతామన్నారు. నిర్లక్ష్యం చేస్తున్న ఉద్యోగులపై కలెక్టర్ ఆగ్రహంగా ఉన్నారని, ఇకపై అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పీజీఆర్‌ఎస్‌కి సంబంధించి ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రత్యేకంగా నోడల్ అధికారులు రాష్ట్ర స్థాయిలో సమస్యల పరిష్కారంపై నిత్యం విచారణ చేపడతున్నారన్నారు. ప్రజలకు అందించాల్సిన సేవల్లో భాగంగా వారు పెట్టుకున్న అర్జీలపై పీజీఆర్‌ఎస్ వెబ్‌సైట్ ద్వారా నిత్యం పరిశీలిస్తూ, నిర్ణీత సమయంలో పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులు, ఉద్యోగులకు అదనపు కమిషనర్లు ఆదేశించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం పీజీఆర్‌ఎస్ సెల్ నుంచి వచ్చిన నిపుణుడు అశోక్ పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో వెబ్ లాగిన్ అయ్యే విధానం, విధి విధానాలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు, ఉద్యోగులకు వివరించారు.

ఎరుకుమాంబ ఆలయంలో 26న శివరాత్రి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో ఎరుకుమాంబ అమ్మవారు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారి ఆలయంలో ఈనెల 26వ తేదీన మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో జీవీ రమాబాయి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ బుధవారం శివరాత్రి పండగ నేపథ్యంలో అమ్మవారు భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తారని తెలిపారు. ఆ రోజు అమ్మవారికి పసుపు నీళ్ల అభిషేకం ఉండవని, భక్తులు గమనించాలని తెలిపారు. మార్చి 5వ తేదీ బుధవారం నుండి అమ్మవారికి యథావిధిగా పసుపు నీళ్ల అభిషేకాలు ఉంటాయని పేర్కొన్నారు. శివరాత్రి ఉదయం 6 నుండి సాయంత్రం 6 వరకు అమ్మవారికి కుంకుమ పూజలు, దర్శనాలు ఉంటాయన్నారు. సాయంత్రం 4 నుండి రాత్రి 10 వరకు పురవీధుల్లో సాంస్కృతిక, నృత్య, వినోద కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. మార్చి 6 గురువారం మారువారం సందర్భంగా మధ్యాహ్నం 12 గంటల నుండి మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు.

'గాదె'ను గెలిపించాలని వినతి

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సోషల్ జస్టిస్ ఫోరమ్, బీసీ ఐక్య వేదిక, కాపు ఐక్యవేదిక, ఈడబ్ల్యూఎస్ హక్కుల పరిరక్షణ వేదిక, దళిత క్రైస్తవ హక్కుల పరిరక్షణ వేదిక, మహిళా హక్కుల పరిరక్షణ వేదిక పక్షాన ఎస్‌జేఎఫ్ తరఫున స్వతంత్ర అభ్యర్థి, బీసీ సామాజిక వర్గానికి చెందిన గాదె శ్రీనివాసులనాయుడుకు పలువురు మద్దతు పలికారు. ఆయా సంఘాల ప్రతినిధులు జంగాల సింగరయ్య యాదవ్, దానా గౌడ్, జి. నవజీవన్‌పాల్, రావి శ్రీనివాస్, బోడపాటి పెదబాబు, పంచాది రంగారావు తదితరులు శుక్రవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అధికార, ధనబలంతో ఇండిపెండెంట్ బీసీ అభ్యర్థిని ఏదో విధంగా ఓడించాలన్న దురుద్దేశంతో నిరంకుశ విధానాలతో ముందుకు వెళ్లడం సమంజసం కాదన్నారు. పోటీలో నిలిచిన ఇతర ఇండిపెండెంట్ అభ్యర్థులను బ్యాలెట్ పేపర్ ముద్రణ తర్వాత కూడా బలవంతంగా వారిని సైలెంట్ చేయిస్తూ ఏదో విధంగా గెలుపు బాటలో ఉన్న శ్రీనివాసులనాయుడుని ఓడించడానికి టీడీపీ చేస్తున్న విశ్వప్రయత్నాలు ధర్మమా? అని ప్రశ్నించారు. ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో 3 స్థానాలకు గాను ఒక స్థానంలో కూడా బీసీలకు అవకాశం ఇవ్వలేదు సరి కదా.. గెలుపు అవకాశాలున్న బీసీ అభ్యర్థిని ఏదో విధంగా ఓడించి వక్రమార్గంలో తమ అభ్యర్థిని గెలిపించుకోవడానికి తెలుగుదేశం చేస్తున్న అప్రజాస్వామిక విధానాలు ఎస్‌జేఎఫ్ ఖండిస్తుందన్నారు. టీడీపీ కుల దురహంకారంతోను, ధన బలంతోను, అధికార దురహకారంతో నిరంకుశంగా ముందుకు వెళ్తే.. ఎస్‌జేఎఫ్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేని రీతిన ఏ ప్రభుత్వం కూడా ఇంతగా దిగజారిపోయి వ్యవహరించలేదని, ప్రభుత్వం ఇప్పటికైనా హుందాగా.. ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు.

పేద రోగుల సేవల్లోనే ఆత్మ సంతృప్తి



డాక్టర్ శివానంద్‌కు జ్ఞాపిక అందజేస్తున్న మాధురి

మహారాణిపేట: పేద రోగులకు వైద్యం అందించడం ఎంతో సంతృప్తిని ఇస్తుందని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ అన్నారు. శుక్రవారం ఆంధ్రా మెడికల్ కాలేజీ సెమినార్ హాల్లో జరిగిన పోస్టు గ్రాడ్యుయేట్ (పీజీ) విద్యార్థులు, ఇతర వైద్య విద్యార్థుల కోసం పరివర్తనాత్మక, ప్రేరణాత్మక ప్రసంగ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోగుల సంరక్షణ, వైద్య విధానం గురించి లోతైన అవగాహన పెంపొందించుకోవాలన్నారు. రోగులకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం తగదన్నారు. వారు ఎన్నో వ్యయ ప్రయాశలకు లోనై ఆస్పత్రికి వస్తారని, అలాంటి వారికి వైద్యం అందించడం సేవతో సమానం అన్నారు. బ్రహ్మకుమారీస్ సమాజ్ నుంచి బి.కె. మాధురి, కేజీహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. రాధ రోగుల సంరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

రేపు శ్రీరామ పట్టాభిషేకం

మురళీనగర్ : మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు వేములపల్లి కళాక్షేత్రంలో శ్రీరామ పట్టాభిషేకం ఉత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించనున్నట్లు పార్కు అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వరప్రసాద్, పీవీఎస్ఎన్ రాజు తెలిపారు. విశాఖ, విజయవాడ, హైదరాబాద్ తవాస్మిదాస బృందం, శ్రీరామ సేవా సమితి సంయుక్తంగా ఆ రోజు ఉదయం 8.30 గంటల నుంచి 12 వరకు ఉత్సవం నిర్వహిస్తారన్నారు. ముఖ్య సంచాలకుడు డాక్టర్ జీఆర్‌కే ప్రసాద్ పర్యవేక్షణలో శ్రీరాముడికి అష్టోత్తర నామావళి పూజ, సీతమ్మ వారికి కుంకుమ పూజ, ఆంజనేయస్వామికి 108 తమలపాకుల పూజ నిర్వహిస్తామని తెలిపారు.

అభాగ్యులకు ఆశ్రయం



వసతిగృహంలో సదానందం



మురళిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున శ్రద్ధా బృందం సభ్యులు

సీతమ్మధార: గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన మానాల సదానందం (58) బట్టల దుకాణంలో పని చేసేవాడు. అయితే అతని భార్య మరణించడంతో కలత చెంది విశాఖ వచ్చేసాడు. అతన్ని ఏయూటీడీ సిబ్బంది శుక్రవారం గుర్తించి భీమ్‌నగర్‌లో గల షెల్టర్ హోంకు తరలించినట్లు కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

సొంతూరు చేరిన వ్యక్తి..

ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తిరుగుతున్న మురళి (32) అనే వ్యక్తిని అప్నాఘర్ ఆశ్రమ్ ప్రతినిధులు నవంబర్ 2024లో గుర్తించారు. అతనికి కొన్ని రోజులు వసతి కల్పించారు. తర్వాత చికిత్స నిమిత్తం ముంబైలోని శ్రద్ధా ఫౌండేషన్‌కు పంపించారు. అక్కడ పూర్తిగా కోలుకోవడంతో అతన్ని తన సొంతూరు పార్వతీపురం మన్యం జిల్లా దగ్గర వేమకోటవరం పంపడానికి నగరంలోని ఏయూటీడీ షెల్టర్ హోంకు తీసుకొచ్చారు. అతన్ని తీసుకుని ఆ ఊరికి వెళ్తే అతని తల్లిదండ్రులు చనిపోయారని, ఎవరూ లేరని గ్రామస్తులు చెప్పారు. దీంతో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు సహకారంతో ఐఆర్‌పీడబ్ల్యూఏ సంస్థ పార్వతీపురంలో నడుపుతున్న డే-నైట్ షెల్టర్ హోంకి తీసుకెళ్లి ఆశ్రయం కల్పించారు. అతనికి ఏదైనా ఉపాధి కల్పిస్తామని అక్కడి షెల్టర్ సిబ్బంది తెలిపారు.

విజయ దుర్గాదేవికి సామూహిక లక్ష కుంకుమార్చన



అమ్మవారిని దర్శించుకుంటున్న మేయర్ హరి వెంకట కుమారి తదితరులు

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు హనుమంతవాక దరి విజయదుర్గా కాలనీలోని విజయ దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం రెండు రోజులుగా నిర్వాహకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం అమ్మవారికి సామూహిక లక్ష కుంకుమార్చన చేపట్టారు. విజయదుర్గా కాలనీ, హనుమంతవాక తదితర ప్రాంతాల మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నసమారాధన చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని పూజించి, ప్రసాదం స్వీకరించారు.

వైభవుడికి సుప్రభాత సేవ నేడు



మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపిస్తారన్నారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. 7.30 గంటలకు బాల భోగం నివేదిస్తారు. అనంతరం భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి, సామూహిక విష్ణు సహస్రనామార్చన, రాజభోగ నివేదన చేస్తారని తెలిపారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా భక్తులకు అన్నసమారాధన జరుగుతుందన్నారు. సాయంత్రం విశేష హారతి సమర్పిస్తారని ప్రసాద్ తెలిపారు.

రైతుబజార్‌లో విక్రయాలకు అందరికీ అవకాశం



సీతమ్మధార రైతుబజారులో కూరగాయలు పరిశీలిస్తున్న పాపారావు

సీతమ్మధార : రైతుబజార్‌లో పంటలు విక్రయించుకునేందుకు ప్రభుత్వం బయటి రైతులకు కూడా అవకాశం కల్పించిందని విశాఖ జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ కార్యదర్శి పి.పాపారావు వెల్లడించారు. ఆయన సీతమ్మధార రైతుబజార్‌ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సొంతంగా పండించిన పంటలతోపాటు మిగతా రైతులు టమాటా పండిస్తే వారికి గిట్టుబాటు ధర రావడానికి ఆ సరకునూ రైతుబజార్‌లో విక్రయించాలని సూచించారు. జిల్లాలో అధికంగా పంటలు పండిస్తూ గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడే రైతులు ఎవరైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. స్థానిక పంటలు సరిపడా వస్తున్నప్పుడు హోల్‌సేల్ మార్కెట్ నుంచి కొని ఎవరూ తీసుకురాకూడదని స్పష్టం చేశారు. రైతుబజార్‌లో కూరగాయల కొరత లేకుండా చూడాలని, రైతులకు అండగా ఉన్నామనే భరోసా కలిగించాలని తెలిపారు. రైతులకు నష్టం రాకుండా రైతుబజార్‌లో సరైన ధరలు నిర్ణయించాలని ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తికి ఆదేశించారు.